ఆంగ్లంపై పట్టు సాధించేలా..

- పోపా ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై ఉచిత శిక్షణ
- కుసుమ రామయ్య పాఠశాలలో తరగతులు
- సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు

సిరిసిల్లటౌన్: పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్‌లో మాట్లాడేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఆంగ్ల మాధ్యమంలో ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివిన వారు కూడా భాషపై పట్టు, అనర్గళంగా మాట్లాడే నైపుణ్యం సాధిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఎంచుకున్న రంగాల్లో రాణించేలా వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్నారు. స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థులపై సండే స్పెషల్ కథనం..


ఉచిత శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

ఆంగ్లభాషపై ఆసక్తి..

జిల్లా కేంద్రంలోని విద్యార్థులు ఆంగ్లభాషపై ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే 150 మంది పిల్లలు సిరిసిల్లలోని కుసుమ రామయ్య జెడ్పీ పాఠశాలలో పద్మశాలీ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఉచిత స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహిస్తున్నారు. పోపాకు చెందిన పలువురు భాషా ప్రావీణ్యులతో నెలరోజుల పాటు ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సామాజిక సేవల్లో భాగంగా విద్యార్థుల్లో ఇంగ్లిష్, పఠనం, మాట్లాడటం, ఉపన్యాసం ఇవ్వడంలో తర్ఫీదు ఇస్తున్నారు. బయటి ప్రపంచంలో ఇంగ్లిష్ గల ప్రాధాన్యతను బట్టి విద్యార్థులు తరగతులకు క్రమం హాజరవుతున్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్‌తో ఉపయోగాలివే..

- ఆంగ్లభాష నైపుణ్యాలు పెంపొందించుకోవడం.
- దేశ, విదేశాల్లో పోటీ ప్రపంచంలో ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడవచ్చు.
- ఆంగ్ల మాధ్యమంలో చదివిన విద్యార్థుల్లోనూ ఇంగ్లిష్‌లో మాట్లాడటంలో ఇబ్బందులు కలుగవు.
- మాతృభాషా ఏదైనా..పోటీప్రపంచంలో ఆంగ్ల భాష మాట్లాడటం తప్పనిసరి అవుతున్న నేపథ్యంలో స్పోకెన్ ఇంగ్లిష్ ఉపయుక్తం.
- ఇంగ్లిష్‌లో పట్టుసాధిస్తే ఉన్నత చదువులు, ఉద్యోగాల్లో రాణిస్తారు.
- కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకుంటారు.

పై చదువులకు ఉపయోగం



పది రోజులుగా ఇక్కడ స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులకు హాజరవుతున్నా. పై చదువులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఇప్పటికే కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగాయి. రోజూ ఆరుగురు ఉపాధ్యాయులు మాకు స్పోకెన్ ఇంగిష్ నేర్పిస్తున్నారు.
– గూడూరి పూజిత్‌కుమార్, పదో తరగతి

సింపుల్‌గా మాట్లాడొచ్చు



ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం పెంచుకుంటున్న. స్పష్టమైన ఇంగ్లిష్ సింపుల్‌గా ఎలా మాట్లాడాలో తెలుస్తుంది. భవిష్యత్‌లో విదేశాల్లో చదువులు, ఉద్యోగాలకు వెళ్లినా భాషపై ఇబ్బంది ఉండదు. ఇంగ్లిష్ పదాలకు తెలుగులో, తెలుగు పదాలకు ఇంగ్లిష్ అర్థాలు తెలుస్తున్నాయి.
– కొండ అక్షయ, ఎనిమిదో తరగతి, మోడల్ స్కూల్

మాట్లాడటం సులువు



వేసవిలో సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్చుకుంటన్నా. ఇన్నిరోజులు ఇంగ్లిష్ అంటే సబ్జెక్టులాగా ఉండేది. ఇప్పుడు సింపుల్ లాంగ్వేజ్‌లా మారింది. కమ్యూనికేషన్ స్కిల్స్ పెరిగి సులువుగా మాట్లాడుతున్నా.
– శ్రీరామోజు అక్షజ్, తొమ్మిదో తరగతి, శ్రీచైతన్య స్కూల్

పదిమందితో శిక్షణ



సామాజిక సేవల్లో భాగంగా పోపా ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్‌ను పదిమంది సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్‌తో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 150 మంది వస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా శిక్షణ ఇస్తున్నాం.
– డాక్టర్ పున్నం చందర్, పోపా జిల్లా అధ్యక్షుడు

ఇరవై ఏళ్లుగా..



ఇంగ్లిష్ టీచర్‌గా ఇరవై ఏళ్లుగా స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు చెప్తున్నా. వాక్య నిర్మాణం, వాడుక భాషల్లో మాట్లాడేలా పిల్లలకు శిక్షణ ఉంటుంది. విద్యార్థులు భవిష్యత్తులో ఇంగ్లిష్ ఉపన్యాసకులుగా మారుతారు. వ్యాకరణంపై పట్టు, ఆంగ్ల పదాలకు అర్థాలు వివరిస్తున్నాం.
– బూర శ్రీనివాస్, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిరిసిల్ల: పట్టణంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ 'సెస్' ఏఈ మధుకర్ శనివారం తెలిపారు. సిరిసిల్లలో 11కేవీ లైన్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా పట్టణంలోని వెంకంపేట, పాత బస్టాండు, సంజీవయ్యనగర్, ఆటోనగర్, ఆసిఫ్‌పుర, అశోక్‌నగర్, అనంతనగర్, అంబికానగర్, కోర్టు ఏరియా, సర్దార్‌నగర్, శాంతినగర్, బీవై నగర్, మార్కెట్ యార్డు ప్రాంతం, గణేశ్‌నగర్, కలెక్టరేట్, రగుడు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7:00 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వివరించారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ మధుకర్ కోరారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాల్లో విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలగింపు పనుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెస్ ఏఈ పృథ్వీధర్ గౌడ్ శనివారం తెలిపారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

వార్షికోత్సవానికి ముస్తాబు


గంగమ్మ ఆలయం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో శ్రీ గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఆలయం ముస్తాబైంది. ఈనెల 21న జరగనున్న వార్షికోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గణపతి పూజ, పున్యహవచనం, అభిషేకం, మండపారాధన, స్థాపిత దేవతా పూజ, చండీ వాహనం, శాంతి కల్యాణం పూర్ణాహుతి ఉంటాయన్నారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణం

కోనరావుపేట: మండలంలోని మర్తనపేటలో బ్రహ్మంగారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయంలో వేద పండితుల సమక్షంలో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుంట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ఐదరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెన్నమనేని వంశీకృష్ణరావు, సింగిల్‌విండో డైరెక్టర్ కాసారపు శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ పర్శరాములు, యూత్ సభ్యులు బోనాల పునీత్, శ్రీనివాస్, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



తంగళ్లపల్లి: ఇటీవల వేర్వేరు ప్రమాదాల్లో భరత్‌నగర్‌కు చెందిన రుద్రారపు చంద్రయ్య, జిల్లెల్లకు చెందిన బచ్చపల్లి నర్సయ్య మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. చంద్రయ్య కుటుంబానికి రూ.10 వేలు, నర్సయ్య కుటుంబానికి రూ.5 వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు. సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, నేరెళ్ల సింగిల్ విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్రావు, మాజీ ఎంపీపీ సరస్వతి, మాజీ జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఇందిరానగర్ మాజీ సర్పంచ్ నాగరాజు, నాయకులు తదితరులున్నారు.

ఆర్థిసాయం అందజేత
మండలంలోని జిల్లెల్లకు చెందిన బచ్చపల్లి నర్సయ్య, భరత్‌నగర్‌కు చెందిన రాధారపు చంద్రయ్య మృతిచెందగా బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. భరత్‌నగర్‌లో బాధిత కుటుంబానికి రూ.5వేలు, జిల్లెల్లలో బాధిత కుటుంబానికి రూ.3వేల చొప్పున ఆర్థికసాయం అందించారు. కాంగ్రెస్ నాయకులు సత్తు శ్రీనివాస్ రెడ్డి ఇరు కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని మాట్లాడారు. నాయకులు తదితరులున్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తంగళ్లపల్లి: తెలంగాణ భవన నిర్మాణ కార్మికసంక్షేమ మండలి, సీఎస్సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో ఆదివారం తంగళ్లపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. లేబర్ కార్డు కలిగిన వారికి వివిధ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. లేబర్‌కార్డులో నమోదై కార్డు పోగొట్టుకున్నవారు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు


మాట్లాడుతున్న భూంపల్లి రాఘవరెడ్డి

తంగళ్లపల్లి: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కాంగ్రెస్ పార్టీ ఇల్లంతకుంట మండల అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కందికట్కూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు న్యాత అశోక్‌ను జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి పసుల వెంకటి, యువజన కాంగ్రెస్ నియోజక అధ్యక్షుడు వినయ్‌కుమార్, ఎంపీటీసీ కర్ణాకర్ రెడ్డి, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు ప్రసాద్, ఎస్సీసెల్ అధ్యక్షుడు రాజేశం, పట్టణ అధ్యక్షుడు నరేశ్, సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, లింగం, రవీందర్ రెడ్డి, అనిల్, చంద్రమౌళి, అశోక్, రమేశ్, కోటేశ్వర్, దాసు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యుత్ బిల్లుల చెల్లింపు



ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల సెస్ విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించేందుకు అవకాశం కల్పించామని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సెస్ ఏఈ పృథ్వీధర్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని సెస్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. గతంలో ఆన్‌లైన్ చెల్లింపులు ఉన్నా కొంతకాలంగా నిలిపివేశారన్నారు. దీంతో గ్రామాల్లో బిల్ కలెక్టర్లు బిల్లులను ఇంతకాలం వసూలు చేశారన్నారు బిల్లులు ఈ విధంగా చెల్లించనివారు ఈనెల 21, 27 తేదీల్లో సెస్ కార్యాలయంలో బిల్లులు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తిచేయాలి


కోనరావుపేట: రైతులతో మాట్లాడుతున్న వికాస్‌రావు


వీర్నపల్లి: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోనరావుపేట: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. మండలంలోని ధర్మారం, కోనరావుపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రోజుల తరబడి కేంద్రంలోనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. అకాలవర్షాలతో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం మొలకెత్తుతుందన్నారు. ఒక్క కోనరావుపేట కేంద్రంలోనే దాదాపు 14 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందన్నారు. వరికి రూ.500 బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గొట్టె రామచంద్రం, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాల్‌కార్ బాలాజీ, బైరగోని సురేశ్, ఎగ్గె మల్లేశం, నోముల భాస్కర్‌రెడ్డి, పాలకుర్తి శ్రీనివాస్, జింక వెంకటి, తిరుపతిగౌడ్ తదితరులు ఉన్నారు.

వీర్నపల్లి: మండలంలోని లాల్‌సింగ్ తండా, అడవిపదిర, రంగంపేట, ఎరగ్రడ్డ తండా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బీజేపీ మండల అధ్యక్షుడు గురుకుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తూకం పూర్తయినా లారీల కొరతతో ధాన్యం నిల్వ ఉందన్నారు. అకాలవర్షంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు లారీలను సకాలంలో తెప్పించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. మండల జనరల్ సెక్రెటరీ లకావత్ తిరుపతి, శక్తి కేంద్రం ఇన్‌చార్జిలు మాలోతు లక్పథ్, భూక్యా రమేశ్, శ్రీనివాస్, బాజిరెడ్డి రాజు, పీర్యా, బూత్ అధ్యక్షుడు లకావత్ రాజు, అజయ్య, దర్శిసింగ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌కు సన్మానం


అబుదాబిలో బాప్స్ మందిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎన్ఆర్ఐలు

వేములవాడ: ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ దుబాయ్ పర్యటనలో భాగంగా శనివారం అబుదాబీలోని బాప్స్ మందిరాన్ని ఎన్ఆర్ఐలతో కలిసి సందర్శించారు. తెలంగాణ వాసి పాల్తీ శ్రీనివాస్ చొరవతో బాప్స్ ప్రధాన సేవకులు ద్వారా ఆలయ విశిష్టతను వివరిస్తూ ప్రత్యేక దర్శనం కల్పించారు. తర్వాత వాసవిమాత జయంతి సందర్భంగా వరల్డ్ ఆర్య వైశ్య మహాసభ నిర్వహించిన అనంతరం వాసవిమాత పూజ, రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ప్రభుత్వ విప్‌ను ఘనంగా సన్మానించారు. వామ్ ప్రెసిడెంట్ రాజేశ్ మైస, వామ్ మిడిల్‌ఈస్ట్ ప్రెసిడెంట్ కృష్ణ ఊరలతో మాట్లాడారు.

రైస్‌మిల్లుల తనిఖీ

కోనరావుపేట: రైస్‌మిల్లులో ఎక్కువ మంది కూలీలను పెట్టి వచ్చిన లారీలను దించుకోవాలని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. మండలంలోని నాగారంలోని సరస్వతి రైస్‌మిల్లు, కనగర్తిలోని మారుతి, కనకదుర్గ రైస్ మిల్లులను శనివారం రాత్రి తనిఖీ చేశారు. ఆయా మిల్లులో తీసుకున్న ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చిన ధాన్యం లారీలను ఎక్కువ మంది కూలీలను పెట్టుకుని తొందరగా అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, డీటీ జయంత్, ఆర్ఐ రాజశేఖర్ ఉన్నారు.







ఘనంగా వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి

సిరిసిల్లకల్చరల్/ఎల్లారెడ్డిపేట/ ముస్తాబాద్ : శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి జయంతి వేడుకలను శనివారం పట్టణంతో పాటు ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సారథ్యంలో సాయంత్రం భారీ ర్యాలీ నిర్వహించారు. శోభాయమానంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై అమ్మవారిని ఉంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. శోభాయాత్రలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముస్తాబాద్‌లో శివాలయం నుంచి వాసవి మాత ఉత్సవ విగ్రహాలతో 101 కలశాలతో పల్లకీలో ఊరేగించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేటలోని వాసవి కన్యకా పరమేశ్వరి మాతా ఆలయాల్లో వాసవి మాత జయంతిని ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల ఆర్యవైశ్యులు, మహిళలు వాసవి మాత ఆలయాల్లో నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ కరికె వనిత కూతురు తేజస్విని, కుమారుడు తేజతో కలిసి ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డిపేటకు వస్తున్నారు. నారాయణపూర్‌కు చెందిన ఎస్కే ఇర్ఫాన్ జీపులో పాత బస్టాండ్ వైపు వెళ్తూ ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో తేజస్వినికి తీవ్రగాయాలకు గురికాగా, తేజ స్వల్పంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.


తేజస్వినికి చికిత్స అందిస్తున్న వైద్యులు



ఘనంగా పెద్దమ్మ బోనాలు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం సిరికొండలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో పెద్దమ్మ-పెద్ది రాజుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ బోనాలు నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ గౌస్ శనివారం తెల్లవారుజామున తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. గౌస్ ఆరోగ్య పరిస్థితిపై పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌస్‌ను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, కిసాన్‌సెల్ అధ్యక్షుడు రాంరెడ్డిలు పరామర్శించారు.

నిత్యావసరాలు పంపిణీ



ఎల్లారెడ్డిపేట: మండలంలోని కిష్టు నాయక్ తండాలోని నిరుపేద గిరిజన కుటుంబాలకు రియల్ ఇండియా మినీ స్ట్రీస్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రియల్ ఇండియా మినిస్ట్రీస్ ఇప్పటికే పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తుండగా తండాలో 25 కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. ప్రతినిధులు శివరాత్రి లక్ష్మణ్, పాస్టర్, మధు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన


రైతులతో మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు

ముస్తాబాద్: మండలంలోని మద్దికుంట, ముస్తాబాద్‌లలో ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ జనగామ శరత్‌రావు కోరారు. మద్దికుంటలో తడిసిన ధాన్యాన్ని శనివారం పరిశీలించారు. ఎంపీపీ మాట్లాడుతూ నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, ఇతర వసతులు కల్పించాలన్నారు. కేంద్రాల్లో వసతులు కల్పించి, ధాన్యం త్వరగా కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రైతులు ఆందోళనకు చెందొద్దన్నారు. లారీల కొరత లేకుండా చూడాలని, మిల్లుల యజమానులకు ఎంపీపీ సూచించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణం
- ఐదురోజుల పాటు వేడుకలు

బోయినపల్లి: మండలంలోని తడగొండ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదురోజుల పాటు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని దీక్షాస్వాములు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఈనెల 22న స్వామివారి పారివేట, 24న రథోత్సవం జరుగుతుందన్నారు. ఐదు రోజుల పంచాహ్నిక కల్యాణంలో రోజూ భక్తులకు తీర్థ, ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పూజారులు చక్రపాణి, హరికృష్ణ, అనిల్, సాయిశర్మ యాజ్ఞీకం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని దీక్షాస్వాములు కోరారు.


ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం